

(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

-190-

(7 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

వేలం పాట... వేలం పాట ఏది చూచినా వేలం పాటగానే వుంది ప్రపంచంలో వ్యక్తులకు, వస్తువులకూ, విధానాలకూ, సాధనాలకూ, జీవితాలకూ, జీతాలకూ, ఆశయాలకూ, ఆత్మీయతలకూ, పదవులకు, ప్రావీణ్యతకూ – విలువలు తగ్గిపోవడం వల్ల ప్రతీదీ వేలం పాటలో పడింది ఈ కాలంలో.

ప్రతీదీ 'ఇస్తా – ఇస్తా ' అంటూ పరుగులు తీయడమేగాని, "ఇస్తారా! దయతలిచి సమర్పిస్తారా?" అని అడిగేవాడు ఎవడూ కనిపించకపోవడం వల్ల వేలం పాటలో పడిపోయినాయి అన్నీ.

ప్రణయంలో వేలం పాటలు ఎక్కువవైనాయి. సినిమాలలో తరుచు వినిపించే ప్రియురాలి పాటల్లో సగం పై చిలుకు వేలం పాటలే. ఒక అందగాణ్ణి వెతుక్కుని "ఇస్తా! ఇస్తా!" అంటూ అతని వెంటపడటమే జరుగుతూ వుంటుంది సామాన్యంగా.

"అడగందే ఇలా వెంటపడతావేం?" అని అడిగే ఠీవి హీరోలో కనిపించదు. సామాన్యంగా అసలు ఆ అందాన్ని వదులుకోవాలని అనిపిస్తేగా నిజానికి ఆ అమ్మాయి ముందుగా బైటపడి వెంటపడకపోతే – అంత పని అతగాడే చేసి వుండేవాడు. అలాటి అవస్థలు కల్పిస్తారు చాలామంది ప్రియురాళ్ళు.

"నా మనస్సు ఇచ్చేస్తా! ఏ షరతులేకుండా ఇచ్చేస్తా. నీ వయస్సిచ్చేస్తా. వారం, వర్షంతో నిమిత్తం లేకుండా వంశం, వంగడంతో ప్రమేయం లేకుండా, ఇచ్చేస్తా! ఇచ్చేస్తా ముమ్మాటికీ ఇచ్చేస్తా." అవి వేలం పాట ప్రారంభించి ఒకసారి రెండోసారి అని కేకలు పెట్టి మగాడోసారి అతడి పేరు కొట్టేస్తుంటే ఇక కావలసిందేం వుంది. కానుకగా స్వీకరించడం తప్ప.

షరతు లేని వేలం పాట పాడటం దానికి అతగాడు అంగీకరించడం ఇవే డ్యూయెట్లలోని చరణాలు, అనే వారి ప్రణయానికి తోరణాలు పాట కోవల్లో "ఆ!ఆ!ఆ!వో!వో!వో" అంటూ రాగాన్ని సాగదీయడాలే వారికి ఆరణాలు.

ఇలా వేలం పాటలో కొట్టి వేయించుకుని, సభ్యతలకు సున్నాలు చుట్ట వేయించుకుని, స్వర్గసీమకు కొత్త పట్టాలు వేయించుకుని కులుకుతూ, కాలం గడిపే జంటలు ఎక్కువవుతున్నారు. దేశంలో ఇది ఒక విధంగా మంచిదే. వేలంలో గెలుచుకున్న వస్తువుపైన మక్కువ ఎక్కువగా వుంటుంది. కనక లోపాలున్న కుక్కిన పేనుల్లాగా పడివుంటాయి...

పూర్వకాలంలో మనదేశంలో వుంటూ వచ్చిన స్వయంవర పద్ధతి కూడా ఒక విధమైన వేలం పాటే. కన్నియ వచ్చిన వారందరిని చూసి ఒకరిమీద మనస్సు లగ్నం చేసుకుని, సిగ్గులు కురిపిస్తూ దండ మెడలో వేయడం "ఇస్తా! ఇస్తా నా సర్వస్వం నీకిస్తా. సందేహం లేదు" అని మూగగా గొంతు చించుకోవడమే.

ఆ మూగరాగాలే ఈనాడు పెద్ద శ్రుతిలో ఆర్కెస్ట్రా సహితంగా హాయిగా వినిపిస్తున్నాయి. వేలం పాటలోకూడా క్రొత్త సొగసులు వచ్చిపడ్డాయి అన్ని రంగాలలో లాగానే, యిందులో కూడా నవ్యభావనం ఉద్భవించింది.

ఈ వేలం పాటలకు కేంద్రాలు ఒకచోట అని కాదు. ఎక్కడ పడితే అక్కడే కాలేజీలు, హాస్టల్సు, పార్కులు, బస్సు స్టాండులు రోడ్డు జంక్షన్లు ఎక్కడ పడితే అక్కడే ఇవి కొనసాగుతూ వుంటాయి. ఎక్కడ ఏ ప్రణయమూర్తి తన సర్వస్వాన్ని వేలం పాట పాడి వెంటనే ఎలాటి దస్తా వేజుతో సంబంధం లేకుండా దాఖలు పరచిపోతుందో తెలుసుకోవడం కష్టం.

"గడవదు యిక కాలం
వేసేస్తా బ్రతుకిక వేలం
మనసే అన్నిటికీ మూలం
అది కనిపించని ఉక్కుగాలం"

ఇలాటి భావనలకు ప్రాధాన్యం ఏర్పడుతున్నది ఈ కాలంలో ప్రణయంలో బలం తగ్గుతున్నదో హెచ్చుతున్నదో తెలుసుకోవడం కష్టం మొత్తానికి వింత వింతగా ముందుకు సాగుతోంది కాలం అన్నిటికంటే ప్రణయం బాదర బందీ విషయం గనుక ఆ విషయం ముందుగా ప్రస్తవించాను అసలు ప్రతి విషయంలోనూ ఇలాటి వేలం పాట పద్ధతులే అమలులోనికి వస్తున్నాయి.

ఒక్క కుర్రవాడున్నాడంటే ఆ వంశంలో తరతరాలుగా సంపాదించి దాచుకున్న కీర్తి ప్రతిష్టల్ని వీధిలో నాలుగు పూటల్లో వేలాం వేసి చక్కా వస్తున్నాడు 'ఇదేమిటయ్యా ఇలా చేశావు? వంశ ప్రతిష్టపోతే ఎలా?' అని ఎవరైనా పెద్దలు హెచ్చరిస్తే –

"నో! దానిదేం వుంది అదంతా వట్టి ఓల్డ్ స్టాక్ దాన్ని తుడిచి వెయ్యడం మంచిది. ఇక్ష్వాకుల నాటి మర్యాదలకిప్పుడేం వాల్యూ వుంటుంది. కొద్ది సంవత్సరాలలో దానికి పదిరెట్లు ప్రతిష్ట సంపాదిస్తాను. ఇదంతా ఫ్రెష్‌స్టాక్ దీని వాల్యూ వేరు ఏడుతరాల్లో ప్రతిష్ట ఏడువారాల్లో సంపాదించే 'కెపాసిటీ' వుంది మన దగ్గిర" అని ఎంతో ధీమాగా మాట్లాడతాడు.

పాపం ఒక గృహస్తు తన కుమారుడు చేస్తున్న అఘాయిత్యాల్ని తలుచుకుని, హృదయంలో కత్తి గుచ్చినంత పని అయి "మా వాడు వంశ ప్రతిష్ట అంతా తీసుకుపోయి, బజారులో వేలం పాట పాడుతున్నాడు. పనికిమాలిన వాళ్ళందరి దగ్గరా పాటలు కట్టి పాడేస్తున్నాడు" అని గోల పెట్టాడు.

గుంభనంగా వుండటం ఏదైనా పనులు చేసే ఆ విషయం గుప్తంగా దాచడం, ఒకవేళ అవసరం వచ్చి బయటకి చెప్పవలసిన అవసరం వస్తే క్లుప్తంగా చెప్పడం ఇలాటి లక్షణాలన్నీ మృగ్యమైపోతున్నాయి.

ప్రతి విషయంలో ఎగబడటం తెగపడటం, అనవసరంగా ముందుకు పడటం మూర్ఛపోవడం ఇవన్నీ ఈనాడు ఎక్కువైనాయి.

అరటికాయలు అమ్మేవాడు "పావలాకి రెండు, ఫస్టుక్లాసు కాయలు" అని అరుస్తున్నాడు, మగపిల్లవాణ్ణి కన్న అదృష్టవంతుడు "పదివేలకు పాట కొట్టేస్తా అందమైన కుర్రాడు ఎం.ఏ ప్యాసయ్యాడు. పెళ్ళికి సిద్ధం. పాటదారులు అనేకమంది వస్తున్నారు. ఎవరిదో అదృష్టం తొందరపడండి. మూట తీసుకురండి – పాట కొట్టేయించుకోండి' అని గ్రుక్క తిరగకుండా పాట పాడుతుంటే. ఈ వేలాం పాట తమాషాలు మరికొన్ని మరోసారి.

Post your comments